RNI NO : TELTEL/2023/88524

మెదక్ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 308
ఆదివారం, అక్టోబర్ 25, 2026 , పేజీలు - 4 వెల : 2/-

గమ్యం స్థిరంగా ఉండాలి,
ప్రయత్నంలో రాజీ
ఉండకూడదు, అప్పుడే విజయం
మనదవుతుంది
- రామకృష్ణ పరమహంస

'రూ.10వేలకోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం

ర్యాలీని వాయిదా వేసుకోండి'



న్యూ ఢిల్లీ : దీపావళి పండుగకు ముందు దిల్లీలో నిర్వహించనున్న ఇండియా కూటమి ర్యాలీని వాయిదా వేయాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) విజ్ఞప్తి చేసింది. నవంబర్ 1న రాంలీలా మైదాన్‌లో జరగనున్న ఈ సభ వల్ల పండుగ సీజన్‌లో వ్యాపార కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలగవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. ర్యాలీ కారణంగా సుమారు రూ.10 వేల కోట్ల వ్యాపారానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించింది. నవంబర్ 10 తర్వాత సభ నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని కోరింది. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ వచ్చే నెల 1న రాంలీలా మైదాన్‌లో ఇండియా కూటమి భారీ ర్యాలీకి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలోనే రాహుల్‌కు సీటీఐ చైర్మన్ బ్రిజేశ్ గోయల్ లేఖ రాశారు.

ఓటు తొలగించారని ఒక్కరూ

ఫిర్యాదు చేయలేదు

● 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' పేరుతో పాదయాత్రలకు సిద్ధమైన బీజేపీ



హైదరాబాద్, అక్టోబరు 24 : తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. తమ ఓటును తొలగించారని రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయలేదని, కానీ కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.ఓటర్ల జాబితా సవరణ పేరుతో పేదలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు, మహిళల ఓట్లను తొలగించి ఎన్నికల్లో గెలవాలని బీజేపీ కుట్ర పన్నుతోందని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించిన విషయం తెలిసిందే.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై మంత్రి పొంగులేటి

కీలక ప్రకటన



హైదరాబాద్, అక్టోబరు 24 : జర్నలిస్టులకు ఇళ్లస్థలాలపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి (శనివారం) కీలక ప్రకటన చేశారు. జర్నలిస్టుల సొంతింటి కల సాకారం చేస్తామని.. వారికి ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. న్యాయపరమైన చిక్కులు లేని విధంగా స్థలాలను కేటాయిస్తామని స్పష్టం చేశారు. నివాసయోగ్యమైన ప్రాంతం లో ఇళ్లస్థలాలు అందిస్తామని చెప్పుకొచ్చారు. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఇళ్లస్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు.సీఎం రేవంత్‌రెడ్డితో పలుమార్లు ఈ విషయంపై చర్చించామని మంత్రి పొంగులేటి తెలిపారు.

కమీషన్ల కోసం కక్కుర్తిపడి

కాళేశ్వరం కట్టారు

ముఖ్యమంత్రి అసమర్థత వల్లే రాష్ట్రంలో కరవు: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



హైదరాబాద్, అక్టోబర్ 24:

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ పార్టీ పదేపదే అబద్ధాలు చెబుతోందని నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో నీటిపారుదల వ్యవస్థను గత ప్రభుత్వం నాశనం చేసిందని మంత్రి దుయ్యబట్టారు.'బీఆర్ఎస్ కమీషన్లకు కక్కుర్తి పడి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణానికి పూనుకుంది. ఉద్దేశపూర్వకంగానే ప్రాణ హిత చేవెళ్ల నుంచి మేడిగడ్డకు మార్చా రు. ప్రాజెక్ట్ వ్యయాన్ని 37వేల కోట్ల నుంచి లక్షన్నర కోట్లకు పెంచారు. వాళ్ళు కట్టిన ప్రాజెక్ట్ వాళ్ల హయాంలోనే కూలి పోయినా.. ఇంకా సిగ్గులేకుండా మాట్లా డుతున్నారు. సీతారామ ప్రాజెక్ట్ రీ డిజైన్ పేరిట 2వేల కోట్ల ప్రాజెక్ట్ వ్యయాన్ని 20 వేల కోట్లకు పెంచారు. అధిక వ్యయంతో నిర్మించినా సరే.. కనీసం ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చారా? జూరాల, దేవాదుల, పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్బీసీ పూర్తి చేసి ఉంటే ఈ రోజు ఎల్‌నినో ప్రభావం తెలంగాణపై ఉండేది కాదు. రాష్ట్రంలో నీటి పారుదల వ్యవస్థను కేసీఆర్ అండ్ కంపెనీ సర్వ నాశనం చేసింది. అబద్ధాలు చెబుతూ.. ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు పేర్ల ముందు జోసెఫ్ గోబెల్స్ అని పెట్టుకుంటే బాగుంటుంది' అంటూ మంత్రి ఉత్తమ్ తీవ్రంగా విమర్శించారు.ముఖ్యమంత్రి అసమర్థత వల్లే రాష్ట్ర ప్రజలు తాగు, సాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, కేపీ వివేకానంద మండిపడ్డారు.

● సోమవారం సీఎం రేవంత్ రెడ్డి ముంబయి వెళ్లనున్నారు.
● తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపనున్నారు.
● సీఎంతో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులు వెళ్లనున్నారు.

తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో చర్చలు

సోమవారం ముంబయికి సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు ముహూర్తం ఖరారైంది. సోమవారం ముంబయిలో చర్చలు జరగనున్నాయి. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ముంబయి వెళ్లనున్నారు. తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్?తో ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొనున్నారు.కేఆర్ఎంబీ సమావేశం వాయిదామరోవైపు సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా పడింది. అదేరోజు ముంబయిలో మహారాష్ట్ర సీఎంతో రేవంత్?రెడ్డి సమావేశం ఉన్నందున వాయిదా వేయాలని తెలంగాణ కోరింది. ఈ విజ్ఞప్తిపై స్పందించిన కేఆర్ఎంబీ సమావే శాన్ని వాయిదా వేశారు. సోమవారం జరగాల్సిన కృష్ణా బోర్డు సమావేశం మంగళవారానికి వాయిదా వేసింది. నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలుసాగునీటి ప్రాజెక్టులపై శుక్రవారం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశంలో భాగంగా తుమ్మిడిహెట్టిపై ప్రధానంగా చర్చించారు. 152 మీటర్ల ఎత్తున తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి ఒప్పించేందుకు అవసరమైన పూర్తి వివరాలను సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజినీర్లను సీఎం ఆదేశించారు.గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అయితే అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకొనే వీల్లేదని ప్రభుత్వం భావిస్తోంది.



దామరచర్లలో గుంజకు కట్టి

కొట్టినా తప్పులేదు

● కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు



హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, ఆయన కుటుంబంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని అడ్డం పెట్టుకుని రూ. లక్ష కోట్ల భారీ అవినీతికి కేసీఆర్ డిజైన్ చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణానికి సూత్రధారి ప్రతిమా శ్రీనివాస్ అని ఆరోపించారు.ప్రపంచంలో ఎక్కడైనా ముడిసరుకు లభించే ప్రాంతంలోనే పరిశ్రమలు స్థాపిస్తారని, కానీ కేసీఆర్ ప్రభుత్వం బొగ్గు లభించే చోట కాకుండా కృష్ణా నదీ పరీవాహక ప్రాంతమైన దామరచర్లలో యాదాద్రి ప్లాంట్‌ను నిర్మించిందని విమర్శించారు. దీనివల్ల రూ. 28 వేల కోట్లతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు వ్యయం రూ. 37,800 కోట్లకు పెరిగిందని, అంటే అదనంగా రూ. 9,800 కోట్లు భారం పడిందని వివరించారు. 40 ఏళ్లలో రూ. లక్ష కోట్ల అవినీతి కోసమే ఈ ప్లాంట్‌ను కేసీఆర్ డిజైన్ చేశారని రేవంత్ ఆరోపించారు.

నా చిన్నతనంలో అన్యాయాలను చూడలేకే

నక్సలైట్ అయ్యా

నేను ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నా.. ప్రజలతోనే ఉండాలనేది నా సిద్ధాంతం...




హైదరాబాద్, అక్టోబరు 24:

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని తెలంగాణ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. స్త్రీల రాజకీయ ఎదుగుదలలో ఎన్నో సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఆయా సమస్యలకు భయపడకుండా వాటిని అధిగమించి వనితలు ఉన్నత స్థానాల్లోకి చేరుకోవాలని ఆకాంక్షించారు. (శనివారం) హైదరాబాద్ మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో.. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు.. మహి ళా రాజకీయ నాయకత్వం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ గురుదీప్ సింగ్ సత్వాల్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, ససత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కోటా నీలిమ, పెద్దఎత్తున మహిళ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు.'నా చిన్నతనంలో నేను ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాను. ఆకలి బాధలు చూశాను.. అయినప్పటికీ అన్ని కష్టాలను ఎదుర్కొని.. నేడు ఈ స్థాయికి చేరుకున్నాను. ములుగు ప్రజల ఆశీర్వాదం, కాంగ్రెస్ పెద్దల అండదండలతో పంచాయతీరాజ్ శాఖకు మంత్రి కాగలిగాను

స్థానిక ఎన్నికలను ఆపేందుకు

5ని పిటిషన్లు.



అమరావతి, అక్టోబర్ 24:

ప్రభుత్వ పనితీరుపైనే ప్రజలు తీర్పు ఆధారపడి ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. (శనివారం) మీడియాతో మాట్లాడుతూ.. రౌడీయిజం, నేరాలు చేసే వారిని ఎవరు హర్షించరన్నారు. పదేళ్లుగా రాష్ట్రంలో శాంతిభద్రతలు వెళ్లాయని తెలిపారు. 'ఉమ్మడి రాష్ట్రంలో నక్సలిజాన్ని నేను కంట్రోల్ చేశా.. నా లైఫ్‌ను కూడా రిస్క్ పెట్టి మరీ చేశాను' అని వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో నెల రోజుల పాటు కర్ఫ్యూ ఉండని.. అప్పట్లో తాను సీఎంగా ఉన్నప్పుడు పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. అప్పటి నుంచి హైదరాబాద్ ప్రశాంతంగా ఉందని చెప్పుకొచ్చారు.
ఏపీని పునర్నిర్మించాం.. బ్రాండ్ ఇమేజ్ పెంచాం
ఎప్పటికప్పుడు కొత్త సమస్యలు వస్తే అధిగమించి వెళ్లామని ముఖ్యమంత్రి అన్నారు. 2019 నుంచి 2024 వరకు ఏపీలో అరాచకం రాజ్యమేలిందని సీఎం విమర్శించారు.

ఆ పరీక్షను వాయిదా వేయాలి

● సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు లేఖ
● ఆ రెండు పరీక్షలు రాసే అవకాశం కల్పించాలి
● నిరుద్యోగ యువత భవిష్యత్తును బలి చేయొద్దు..



హైదరాబాద్, అక్టోబరు 24 :

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు (శనివారం) బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ ఇంజినీరింగ్ విద్యార్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయొద్దని సూచించారు. నవంబర్ 6వ తేదీన జరగనున్న టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్షను వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్ 2, టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్షలు ఒకే తేదీలో ఉండటంతో వేలాది మంది తెలంగాణ ఇంజినీరింగ్ అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో గ్రూప్ 2 పరీక్ష రాసే అభ్యర్థులు వెంటనే తెలంగాణకు తిరిగివచ్చి ఏఈఈ పరీక్ష రాయడం ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు.ఏళ్ల తరబడి కష్టపడి సిద్ధమైన రెండు పోటీ పరీక్షల్లో నిరుద్యోగ యువత ఒకదాన్ని వదులుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. పరీక్షల తేదీలు మార్చాలని పలుమార్లు విజ్ఞప్తులు చేసినా టీజీపీఎస్సీ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. పరీక్షల తేదీలను పున: పరిశీలించాలని అక్టోబర్ 14వ తేదీనే టీజీపీఎస్సీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేఖ రాశారని ప్రస్తావించారు. నిరుద్యోగ యువత రెండు పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని కోరారు.ఒడిశా, బిహార్ వంటి రాష్ట్రాల్లో పరీక్షల తేదీలు మార్చినప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదు? అని హరీశ్‌రావు నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్.. భేషజాలకు పోయి నిరుద్యోగ యువత భవిష్యత్తును బలి చేయొద్దని హితవు పలికారు.

సిద్దిపేటలో దారుణం బాలికపై

సామూహిక అత్యాచారం

ఏడుగురి అరెస్ట్



తెలంగాణలోని సిద్దిపేట జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. 15 ఏళ్ల బాలికపై ఏడుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు మైనర్లు సహా నిందితులందరినీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం..

దసరా పండుగ రోజున బాలిక తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను గమనించిన నిందితులు, ఆమెను కిడ్నాప్ చేసి సమీపంలోని మరో గ్రామానికి తీసుకెళ్లారు.

అల్లూరి జిల్లాలో మైనింగ్ చేస్తుండగా పేలుడు

- ఏడుగురు మృతి



అల్లూరి జిల్లా: అల్లూరి జిల్లాలోని అనంతగిరి మండలం పినకోట పంచాయతీ పీచుమామిడి వద్ద రోడ్డు పనుల కోసం బ్లాస్టింగ్ పనులు చేపట్టా రు. ఇందు కోసం జిలెటిన్ స్టిక్స్ ను అమర్చిన ప్రత్యేక పరికరాన్ని వినియోగించారు. ఈ యంత్ర లో డీజిల్ నింపుతుం డగా అక స్మాత్తుగా మంటలు చెలరేగి పేలు డు సంభవించింది. ఆ సమయంలో అటువైపుగా వెళ్తున్న వా హనాలు ప్రమాదానికి గురయ్యాయి. జిలెటిన్ స్టిక్స్ పేలుడు ధాటికి రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. అక్కడున్న ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

భక్తిశ్రద్ధలతో శబరిమల

మహాపాదయాత్ర ప్రారంభం





● కిష్టారెడ్డిపేట నుంచి శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప భక్తులు

● పాదయాత్రను ప్రారంభించిన అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్

● యాత్ర బృందానికి రూ. 1,00,000 ఆర్థిక సహాయం అందజేత

అమీన్‌పూర్, అక్టోబర్ 24:
(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని బీరంగూడ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట దుర్గామాత దేవాలయం నుంచి కేరళలోని పవిత్ర పుణ్యక్షేత్రం శబరిమల వరకు చేపట్టిన 'బి.హెచ్.ఇ.ఎల్. టెంపుల్ శ్రీ శబరిమల 3వ మహా పాదయాత్ర' శనివారం ఉదయం భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, అయ్యప్ప స్వాముల మహాపాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేపట్టిన భక్తుల బృందానికి తన వంతు సహాయంగా నందారం నరసింహ గౌడ్ రూ. 1,00,000 (లక్ష రూపాయల) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇక్కడి నుంచి కాలినడకన శబరిమల వరకు వెళ్లడం సాధారణమైన విషయం కాదని అన్నారు. సుమారు 40 రోజులకు పైగా ఎండనక, వాననక, రాత్రనక పగలనక కఠిన నియమాలతో కాలినడకన సాగించే ఈ పాదయాత్ర కేవలం ఆ మణికంఠుడి దివ్య ఆశీస్సులతోనే విజయవంతంగా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. స్వాములందరి యాత్ర నిరాటంకంగా కొనసాగి, క్షేమంగా శబరిమల చేరి అయ్యప్ప దర్శనం చేసుకోవాలని, లోక కల్యాణం కోసం భక్తులు చేస్తున్న ఈ సంకల్పం నెరవేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్ ముదిరాజ్, గురుస్వాములు తో పాటు పలువురు నాయకులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి.

సమాజ హితానికి ముందుండండి

● గీతం రోటరాక్ట్ క్లబ్ సభ్యులకు ప్రముఖుల ఉద్బోధ
కొత్త నాయకత్వ బృందానికి బాధ్యతలు

పటాన్‌చెరు, అక్టోబర్ 24:
(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి, సమాజ హిత కార్యక్రమాలలో పాల్గొనడానికి, సమాజానికి సానుకూలంగా తోడ్పడటానికి గీతం రోటరాక్ట్ క్లబ్ సదా ముందుండాలని ప్రముఖులు ఉద్బోధ చేశారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, విద్యార్థి నాయకత్వం, సమాజ సేవ, సామాజిక బాధ్యతను పెంపొందించే తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, రోటరాక్ట్ క్లబ్ నూతన సభ్యులకు పదవీ బాధ్యతలను అప్పగించింది. ముఖ్య అతిథి, జిల్లా రోటరాక్ట్ ఛైర్మన్ డాక్టర్ జి.ఎస్.ఎస్. ప్రకాష్, ఆత్మీయ అతిథి రొటేరియన్ జె. యోగేశ్వర్ రెడ్డి, ఇతర ప్రముఖ రోటరీ, రొటరాక్ట్ ప్రముఖులతో కలిసి సాంప్రదాయబద్ధంగా దీప ప్రజ్వలనతో 2026-27 పదవీ కాలానికి బాధ్యతలు చేపట్టే కార్యక్రమం ప్రారంభమైంది. ఈ



కార్యక్రమంలో కొత్త సభ్యుల చేరిక, క్లబ్ నాయకత్వ బృందం యొక్క లాంఛన ప్రమాణ స్వీకారం జరిగాయి. అనంతరం బోర్డు పిన్నింగ్, వార్షిక ప్రణాళిక ఆవిష్కరణ జరిగాయి. ఈ మైలురాళ్లు సమాజ భాగస్వామ్యం, సేవ, నాయకత్వ అభివృద్ధిపై దృష్టి సారించిన విద్యార్థి నేతృత్వంలోని కార్యక్రమాల నూతన అధ్యాయానికి నాంది పలికాయి. ఐరిస్ హైదరాబాద్ రోటరీ క్లబ్ సహకారంతో, గీతం హైదరాబాదులోని రొటరాక్ట్ క్లబ్, 'స్వార్థం కన్నా సేవ మిన్న' అనే రోటరీ నినాదాన్ని అనుసరించి, ఈ క్లబ్ విద్యార్థులలో స్వచ్ఛంద సేవ, జట్టు స్ఫూర్తి, సామాజిక బాధ్యత వంటి స్ఫూర్తిని పెంపొందించడానికి ప్రయత్నిస్తుంది. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య



విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ తో పాటు, ఇతర విశిష్ట అతిథులు, రోటరీ, రోటరాక్ట్ సభ్యులు హాజర య్యారు. ఈ ప్రారంభోత్సవం, కొత్తగా నియమితులైన నాయకత్వ బృందానికి ఒక ఉజ్వలమైన యేడాదికి నాంది పలికింది. విద్యార్థులను బాధ్యతాయుతమైన నాయకులుగా, సమాజానికి చురుకైన భాగస్వాములుగా తీర్చి దిద్దడంపై ఇది నూతనంగా దృష్టి సారించింది.

హరీష్ రావును మర్యాదపూర్వకంగా

కలిసిన బీఆర్ఎస్ నేతలు



● దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి

అమీన్‌పూర్ అక్టోబర్ 24:
(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును ఆయన నివాసంలో బీఆర్ఎస్ ముఖ్య నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. పండుగ అనంతరం ఈరోజు ఉదయం అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని తాజా రాజకీయ పరిస్థితులు, స్థానిక అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై కొద్దిసేపు చర్చించారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసే హరీష్ రావు నాయకత్వం అందరికీ ఆదర్శప్రాయమని నేతలు పేర్కొన్నారు. ఈ భేటీ అనంతరం అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధిలో, ప్రజా సమస్యల పరిష్కారంలో హరీష్ రావు గారి పాత్ర ఎనలేనిదని, కార్యకర్తలకు నిరంతరం అండగా నిలిచే గొప్ప నాయకుడని కొనియాడారు. గూడెం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై పోరాడేందుకు హరీష్ రావు గారి సూచనలు, సలహాలు అమూల్యమైనవని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అంతి రెడ్డి, పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉల్లి తిమ్మాయిపల్లి పంచాయతీని సందర్శించిన

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

● నీటి వృథా అరికట్టాలి, విద్యుత్ పొదుపు పాటించాలి - సర్పంచ్, కార్యదర్శికి ఎమ్మెల్యే సూచన

చేగుంట అక్టోబర్ 24 మెదక్ టుడే న్యూస్

చేగుంట మండలం ఉల్లి తిమ్మాయపల్లి గ్రామ పంచాయతీని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులతో సమావేశమై పలు సూచనలు చేశారు.గ్రామంలో నీటిని వృథా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, విద్యుత్‌ను అవసరమైన మేరకే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వనరులను పొదుపుగా వాడుకోవడం ద్వారా గ్రామాభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు.అనంతరం గ్రామంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఆయా పనులకు సంబంధించిన వివరాలను పరిశీలించి, వీలైనంత త్వరగా నిధులు విడుదలయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్య నారాయణ, కార్యదర్శి స్వాతి, పాలకవర్గ సభ్యులు, చేగుంట మండల బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



జీవకా ఇండస్ట్రీ కాలుష్యంపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



● ప్రజల ఆరోగ్యం, పర్యావరణాన్ని కాపాడాలి - జిల్లా కలెక్టర్, పీసీబీ కి వినతి

చేగుంట అక్టోబర్ 24 మెదక్ టుడే న్యూస్

చేగుంట మండలం, చేగుంట గ్రామ శివారులో ఉన్న జీవకా ఇండస్ట్రీ (స్టీల్ ప్లాంట్) కాలుష్యంపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు.గతంలో చిన్న స్థాయిలో ఉన్న జీవకా పరిశ్రమ ప్రస్తుతం సుమారు 10 నుంచి 15 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిందని, పరిశ్రమ నుండి వెలువడుతున్న నల్లటి పొగ, దుమ్ముతో చుట్టుపక్కల 7 నుంచి 8 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులుఎ దుర్కొంటున్నారని ఆయన తెలిపారు.రాత్రంతా వెలువడే పొగతో ఇళ్లలోకి దుమ్ము చేరుతోందని, పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. గాలి కాలుష్యంతో పాటు భూగర్భ జలాల కాలుష్యంపై కూడా ఆందోళనలువ్యక్తమవుతున్నాయన్నారు. పరిశ్రమ సమీపంలో భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతు న్నాయని తెలిపారు."ఇది గ్రామీణ ప్రాంతం, హైదరాబాద్ పరిసరాల్లోని పారిశ్రామిక ప్రాంతం కాదు. పల్లెటూర్లలో నివసించే ప్రజలు, చిన్నారులు, పాఠశాలలపై కాలుష్య ప్రభావం పడకుండా చూడాలి" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.పరిశ్రమ విస్తరణకు సంబంధించిన అనుమతులు, కాలుష్య నియంత్రణ చర్యలు, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారా లేదా అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమల శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, కాలుష్య నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, గ్రామీణ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం తక్షణమే స్పందించి చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో చేగుంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, చేగుంట మాజీ సర్పంచ్ మంచి కట్ల శ్రీనివాస్, బి ఆర్ ఎస్ పార్టీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రాజిరెడ్డి, బి ఆర్ఎస్ పార్టీ మాజీ జెడ్పిటిసి మోదాం శ్రీనివాస్, కర్నూల్ పల్లి ఉపసర్పంచ్ శివకుమార్, డిష్ రాజు, వంశీ,అలీ,సుభాష్ రెడ్డి, కశబోయిన సుదర్శన్, సురేష్ రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిట్టోజిపల్లిలో సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్

విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

చేగుంట అక్టోబర్ 24 మెదక్ టుడే న్యూస్

చేగుంట మండలంలోని చిట్టోజిపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ ఘనంగా ముగిశాయి. ఫైనల్స్ లో గెలుపొందిన జట్లకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి బహుమతులు అందజేశారు.ఈ టోర్నమెంట్ ను చేగుంట మండల సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షుడు, బి.కొండాపూర్ సర్పంచ్ రంగయ్యగారి రామకృష్ణారెడ్డి, రాజిరెడ్డి నిర్వహించారు. విజేతలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా మొదటి బహుమతి రూ.12,000/-, రెండవ బహుమతి రూ.8,000/- నగదు పురస్కారాలను అందజేశారు.క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందిస్తాయని, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమం



లో చేగుంట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, చిట్టోజిపల్లి గ్రామ సర్పంచ్, చేగుంట మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, డిష్ రాజు, సుభాష్ రెడ్డి, సురేష్ రెడ్డి, వంశీ, శ్రీను, రవి, అన్నం రవి తదితరులు పాల్గొన్నారు.

హరీష్ రావు, మహిపాల్ రెడ్డిలకు దసరా శుభాకాంక్షలు

తెలిపిన మాజీ కౌన్సిలర్ సదువు మల్లేష్ ముదిరాజ్





ఆర్మీ సైనికుడిపై దాడి

జగిత్యాల జిల్లా :మెట్‌పల్లి ఇబ్రహీంపట్నం
అక్టోబర్ 24(మెదక్ టుడే న్యూస్):

కోరుట్ల నియోజకవర్గం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండలింగాపూర్ గ్రామంలో ఆర్మీ సైనికుడిపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి 14 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 14 సెల్‌ఫోన్లు, 7 ద్విచక్ర వాహనాలు, ఒక స్టీల్ చేతి కడియాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరికొందరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు..శుక్రవారం తెల్లవారుజామున గ్రామంలోని హనుమాన్ ఆలయం సమీపంలో బతుకమ్మ ఆడుతున్న వారి పక్క నుంచి కొంతమంది యువకులు వేగంగా, నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాలపై వెళ్లారు. అక్కడే ఉన్న ఆర్మీ సైనికుడు తిగుర్ల స్వామి వారిని ప్రశ్నించడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో కొందరు ఆయనపై దాడి చేయడంతో పాటు స్టీల్ చేతి కడియంతో ముఖంపై దాడి చేసారు. ఈ ఘటనలో స్వామికి తీవ్ర రక్తగాయాలయ్యాయి.బాధితుడు తిగుర్ల స్వామి ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా శనివారం ఉదయం మేడిపల్లి గ్రామ శివారులోని



ఇబ్రహీంపట్నం ఎక్స్‌రోడ్డు వద్ద వెల్లుల్ల గ్రామానికి చెందిన 14 మందిని అదుపులోకి తీసుకోవటం . వారి నుంచి 14 సెల్‌ఫోన్లు, 7 ద్విచక్ర వాహనాలు, ఒక స్టీల్ చేతి కడియాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేశారు. అనంతరం రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచిన్నట్లు పోలీస్ లు తెలియజేసారు.
అరెస్టయిన నిందితుల పేర్లు
బావు రమేష్, తుపాకుల స్వామి, బావు అఖిల్, లక్కంపల్లి కార్తీక్, మర్రి నీరజ్, లక్కంపల్లి కళ్యాణ్, ఐలేని వంశీ, కల్లూరి మహేష్, కల్లూరి వంశీ, కాంతి విశాల్, బొబ్బిలి నాగరాజ్, పోచంపల్లి సాయి, మంచాల పవన్, కల్లూరి రవి.ఈ సందర్భంగా మెట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సురేష్ బాబు, ఇబ్రహీంపట్నం ఎస్ఐ జి. నవీన్ కుమార్ మాట్లాడుతూ.. యువత అర్ధరాత్రి వేళల్లో గుంపులుగా తిరుగుతూ గొడవలకు, దాడులకు పాల్పడితే భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో ఉంటున్నారు అనే విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.యువత చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నేరాలకు పాల్పడటం వల్ల భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు, పాస్‌పోర్టు వెరిఫికేషన్ వంటి ప్రక్రియలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. కేసులో పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు కొనసాగుతున్నట్లు తెలిపారు.

అమీన్‌పూర్, అక్టోబర్ 24:
(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్‌పూర్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ సదువు మల్లేష్ ముదిరాజ్ కాలనీవాసులతో కలిసి ప్రముఖ ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావును ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డిని కలిసి పండుగ శుభాకాంక్షలు అందజేశారు.
కాలనీ సమస్యలు, అభివృద్ధి విషయాలపై కూడా నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, సత్యనారాయణ,మాజీ కౌన్సిలర్ మల్లేష్ ముదిరాజ్‌తో పాటు స్థానిక కాలనీ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలి



● 70 రెవెన్యూ గ్రామాల్లో తొలి దశ సర్వే త్వరగా పూర్తి చేయాలి: సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్




మెదక్,అక్టోబర్,24,మెదక్ టుడే న్యూస్:(ప్రతినిధి)
భూ రీసర్వే మొదటి దశ పనులను వేగవంతం చేసి, ఎంపిక చేసిన 70 రెవెన్యూ గ్రామాల్లో సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.అవసరమైన అదనపు బృందాలు, సాంకేతిక పరికరాలను సమకూర్చుకొని, క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.భూ రీసర్వే పురోగతిపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్ పాల్గొన్నారు.గ్రామాల వారీగా పురోగతిని సమీక్షిస్తూ,భూ రికార్డుల్లో పారదర్శకతకు ప్రాధాన్యమివ్వాలని కమిషనర్ సూచించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించడంలో
పీఎం రాహత్ పథకం కీలక పాత్ర పోషిస్తుంది

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.





మెదక్,అక్టోబర్,24, మెదక్ టుడే న్యూస్: (ప్రతినిధి)
పీఎం రాహత్ (ప్రైమ్ మినిస్టర్ రోడ్ ఆక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలిజేషన్ అండ్ అస్యూర్డ్ ట్రీట్మెంట్) పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు,సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈసమావేశంలో భాగంగా రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో అత్యవసర వైద్యం అందించడం, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల అనుసంధానం, నిధుల విడుదల ప్రక్రియపై చర్చించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడిని ఆసుపత్రిలో చేర్పించడానికి పోలీస్ ఆమోదిత కేసులకు గరిష్టంగా 1 లక్షా 50 వేల రూపాయల వరకు పూర్తి చికిత్స అందించే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు.ప్రమాదం తర్వాత బాధితుల ప్రాణాలు కాపాడేందుకు గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని, ఈ సమయంలో వేగంగా స్పందించాలని అన్నారు. ఈ పథకం సమర్థవంతమైన అమలు కోసం జిల్లా కలెక్టర్లు రహదారి భద్రత కమిటీలతో సమన్వయం చేసుకొని, జిల్లా ఇన్ఫ్రాస్ట్రక్చర్ అధికారులను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని సూచించారు.ప్రమాదాల నివారణకు, బాధితుల వివరాలను పారదర్శకంగా నమోదు చేయడానికి టీఎంఎస్ 2.0 పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు.జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా బాధితుల చికిత్స ఖర్చులను నేరుగా ఆసుపత్రులకు చెల్లించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.ప్రజలలో ఈ పథకంపై అవగాహన కల్పించాలని అన్నారు. అత్యవసర సేవల కోసం 112, సిసిటి ఎన్ఎస్ వ్యవస్థలతో అనుసంధానం చేయడం ద్వారా బాధితులకు వేగవంతమైన సేవలు అందుతాయని వివరించారు.ప్రతి జిల్లాలోనూ ఈ పథకం అమలును కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎస్ స్పష్టం చేశారు.జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొన్నారు.వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పీఎం రాహత్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించి, వారి ప్రాణాలు కాపాడాలన్నారు.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత శాఖలు వెంటనే అప్రమత్తమవ్వాలని అన్నారు.నగదు, బాధితుల సమాచారం అందుబాటులో లేని కారణంగా వైద్యసేవలు నిరాకరించకూడదన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఉండి ప్రమాదాల వల్ల కలిగే ప్రాణ నష్టాలను తగ్గించాలని తెలిపారు.ఈ వీసీలో రవాణా శాఖ అధికారి చక్రవర్తి,రవి తేజ ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జీర్ణక్రియకు మేలు చేసే
ఫైబర్ జెల్లీ తయారీ ఇలా..



రోజువారీ ఆహారంలో తగినంత పీచు పదార్థం తీసుకోవడం జీర్ణక్రియ సక్రమంగా సాగడానికి, మలవిసర్జన క్రమబద్ధంగా ఉండడానికి, పేగుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఎంతో అవసరం. అయితే, ఆహారం ద్వారా మాత్రమే శరీరానికి సరిపడా పీచు పదార్థాన్ని పొందడం చాలామందికి సాధ్యం కావడం లేదు. ఈ సమస్యకు పరిష్కారంగా పోషకాహార నిపుణులు సులభంగా తయారు చేసుకోగలిగే అధిక పీచు పదార్థం కలిగిన జెల్లీ తయారీ విధానాన్ని వెల్లడించారు. ఈ జెల్లీ మలవిసర్జన సజావుగా జరిగేందుకు తోడ్పడడంతోపాటు రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండేందుకు కూడా సహాయపడుతుందని పేర్కొంటున్నారు. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో పోషకాహార నిపుణురాలు దీపశిఖా జైన్ ఈ జెల్లీ తయారీ విధానాన్ని వివరించారు. ఈ వంటకాన్ని ఇంతకు ముందు ఎందుకు ప్రయత్నించలేదా అని అనిపిస్తోందని, ఇది జెల్లీలా ఉన్నప్పటికీ అధిక మొత్తంలో పీచు పదార్థాన్ని అందిస్తుందని ఆమె తెలిపారు. ప్రతిరోజూ రాత్రి నిద్రపోయే ముందు ఈ జెల్లీని ఒక చెంచా తీసుకుంటానని వెల్లడించారు. దీని తయారీ కూడా ఎంతో సులభమని వివరించారు.

అధిక పీచు పదార్థం కలిగిన జెల్లీని ఎలా తయారు చేయాలి?

ముందుగా ఒక చిన్న గాజు సీసా తీసుకోవాలి. అందులో రెండు టేబుల్ స్పూన్ల ఇసబ్గోల్ లేదా సైలియం హస్క్ వేయాలి. ఈ జెల్లీ తయారీలో ఇదే ప్రధాన పదార్థమని ఆమె తెలిపారు. అనంతరం అర కప్పు కొంబుచా కలపాలి. అయితే, అందులో జీవించి క్రియాశీలంగా ఉండే సూక్ష్మజీవుల కల్చర్ ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. కొంబుచా అనేది పులియబెట్టిన టీ అని, ఇది పేగుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ఆమె వివరించారు. ఈ పదార్థాలన్నింటినీ బాగా కలిపిన తర్వాత కొద్దిగా నీటిని జోడించాలి. మరోసారి మిశ్రమాన్ని బాగా కలిపి రాత్రంతా రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. మరుసటి రోజుకు పేగుల ఆరోగ్యానికి తోడ్పడే జెల్లీ సిద్ధమవుతుందని దీపశిఖా జైన్ తెలిపారు. ఈ జెల్లీ తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండడంతోపాటు మలవిసర్జన మెరుగుపడినట్లు ఆమె తన వీడియోలో వెల్లడించారు. అయితే, ఈ వంటకం తన సొంత ఆలోచన కాదని, ఆన్‌లైన్‌లో చూసి తెలుసుకున్నానని, రుచిగా కూడా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.

ఎంత తీసుకోవాలి..?

ఈ జెల్లీని రోజుకు ఒకటి నుంచి రెండు టేబుల్ స్పూన్ల పరిమితిలో మాత్రమే తీసుకోవాలని ఆమె సూచించారు. అధికంగా తీసుకుంటే జీర్ణవ్యవస్థకు సంబంధించిన అసౌకర్యాలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా సైలియం హస్క్ తీసుకునేటప్పుడు తగినంత ద్రవం తీసుకోవడం అవసరం. మింగడంలో ఇబ్బందులు ఉన్నవారు లేదా మందులు వాడుతున్నవారు దీనిని ఆహారంలో చేర్చుకునే ముందు వైద్య నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. ఈ జెల్లీ సమతుల్య ఆహారానికి ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోవాలి.

పండుగల వేళ జీర్ణ సమస్యలా ఇంట్లోనే తయారు చేసుకోండి
ఈ 4 ప్రోబయోటిక్ ఆహారాలు



పండుగల సమయంలో పిండి వంటలు, నూనెలో వేయించిన చిరుతిళ్లు, స్వీట్లు, మసాలా వంటకాలు ఎక్కువగా తినడం వల్ల కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. ఇలాంటి సమయంలో పేగుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రయోజనకరమైన సూక్ష్మజీవులు ఉండే ప్రోబయోటిక్ ఆహారాలను తీసుకోవడం ఉపయోగపడుతుంది.

ప్రోబయోటిక్ ఆహారాలు అంటే ఏమిటి?

ఆహారంలోని చక్కెరలు, పిండి పదార్థాలను బ్యాక్టీరియా, ఈస్ట్ వంటి సూక్ష్మజీవులు విచ్ఛిన్నం చేసే సహజ ప్రక్రియను కిణ్వ ప్రక్రియ అంటారు. అయితే కిణ్వ ప్రక్రియకు గురైన ప్రతి ఆహారం ప్రోబయోటిక్ కాదు. ఇడ్లీ, దోశ, ధోక్లా వంటి పదార్థాలు కిణ్వ ప్రక్రియ ద్వారా తయారైనా, వాటిని ఉడికించడం వల్ల ప్రయోజనకరమైన జీవ బ్యాక్టీరియాలో కొంత భాగం నశిస్తుంది. పేగుల్లో బ్యాక్టీరియా సమతుల్యతను కాపాడడానికి జీవ సూక్ష్మజీవులు ఉండే ఆహారాలు తోడ్పడతాయి.

ఇంట్లోనే తయారు చేసుకోగలిగే 4 ప్రోబయోటిక్ ఆహారాలుపులియబెట్టిన అన్నం గంజి: ఉడికించిన అన్నాన్ని శుభ్రమైన తాగునీటిలో వేసి మూతపెట్టి, వాతావరణ పరిస్థితులను బట్టి 8-12 గంటలు ఉంచాలి. మరుసటి రోజు తాజాగానే తీసుకోవచ్చు. కావాలనుకుంటే కొద్దిగా ఉప్పు కలుపుకోవచ్చు. అయితే పరిశుభ్రత పాటించడం, ఆహారం సురక్షితంగా పులిసిందని నిర్ధారించుకోవడం ముఖ్యం.రాగి గంజి: రాగి పిండిని నీటితో కలిపి మెత్తని గంజిలా ఉడికించాలి. పూర్తిగా చల్లారి న తర్వాత జీవ సూక్ష్మజీవులు ఉండే పెరు గును ఒక చెంచా కలపాలి. శుభ్రమైన పాత్ర లో మూతపెట్టి, వెచ్చని ప్రదేశంలో 6-8 గంటలు ఉంచాలి. కిణ్వ ప్రక్రియ పూర్తయ్యాక ఫ్రిజ్‌లో పెట్టాలి.ఇంట్లో తయారుచేసే గ్రీక్ యోగర్ట్: 500 మిల్లీలీటర్ల పాలను వేడి చేసి, గోరువెచ్చగా అయ్యాక జీవ సూక్ష్మ జీవులు ఉండే పెరుగును 1-2 చెంచాలు కలపాలి. మూతపెట్టి 6-10 గంటలు వెచ్చని ప్రదేశంలో ఉంచాలి. పెరుగు గడ్డకట్టిన తర్వాత ఫ్రిజ్‌లో పెట్టాలి. అనంతరం శుభ్రమైన పలుచని వస్త్రంలో 2-4 గంటలు వడకడితే చిక్కగా ఉండే గ్రీక్ యోగర్ట్ సిద్ధమవుతుంది.

ఉసిరికాయ పచ్చడి తరహా కిణ్వీకృత ఆహారం: తాజా ఉసిరికాయలను కడిగి పూరిగా ఆరబెట్టి ముక్కలుగా కోయాలి. ప్రతి కిలో ఉసిరికాయలకు 20 గ్రాముల ఉప్పు కలిపి, ఉడికించి చల్లార్చిన నీటిలో పూర్తిగా మునిగేలా శుభ్రమైన గాజు సీసాలో ఉంచాలి. కిణ్వ ప్రక్రియ కోసం కొన్ని రోజులు గది ఉష్ణోగ్రత వద్ద ఉంచి, పుల్లని రుచి వచ్చిన తర్వాత ఫ్రిజ్‌లో పెట్టాలి.

ఈ ప్రక్రియలో పరిశుభ్రత, సరైన ఉప్పు పరిమాణం, సుంకి క్షితమైన కిణ్వీకరణ ఎంతో ముఖ్యం. పండుగల సమయంలో ఆహారాన్ని ఆస్వాదిస్తూనే జీర్ణవ్యవస్థ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి. అయితే ఈ ఆహారాలన్నీ ప్రతి ఒక్కరికీ ఒకే విధంగా పనిచేయవు. కడుపు ఉబ్బరం తరచూ వస్తుంటే లేదా తీవ్రమైన జీర్ణ సమస్యలు ఉంటే వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.

వ్యాయామం చేస్తున్నారా.. పొటాషియం ఉండే వీటిని తింటే మేలు.



శారీరక దృఢత్వాన్ని పెంచుకోవడానికి, ఎక్కువసేపు వ్యాయామం చేసే సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి, మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ఎంతో అవసరం. అయితే, వ్యాయామం చేయడం ఒక్కటే సరిపోదు. కండరాల పనితీరును మెరుగుపరచడం, శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడడం, శారీరక శ్రమ తర్వాత శరీరం కోలుకోవడంలో ఆహారం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారు తమ ఆహారంలో తగినంత పొటాషియం ఉండేలా చూసుకోవాలి. పొటాషియం శరీరానికి అవసరమైన ముఖ్యమైన ఖనిజం. ఇది ఎలక్ట్రోలైట్‌గా పనిచేస్తూ కండరాలు సంకోచించడానికి, నరాల ద్వారా సంకేతాలు ప్రసారం కావడానికి, శరీరంలో ద్రవాల సమతుల్యతను నిర్వహించడానికి సహాయపడుతుంది. వ్యాయామం చేస్తున్నప్పుడు కండరాలు సక్రమంగా పనిచేయడానికి శరీరంలోని ఎలక్ట్రోలైట్లు సమతుల్యంగా ఉండాలి. ఈ ప్రక్రియలో పొటాషియం కీలక పాత్ర పోషిస్తుంది.

సమతుల్య ఆహారం ముఖ్యం..

చెమట ద్వారా కొంత పొటాషియం శరీరం నుంచి బయటకు వెళ్తుంది. అయితే, ఎంత పరిమాణంలో కోల్పోతామన్నది వ్యాయామ తీవ్రత, దాని వ్యవధి, వాతావరణ ఉష్ణోగ్రత, వ్యక్తిగతంగా చెమట పట్టే తీరుపై ఆధారపడి ఉంటుంది. చాలామందికి పొటాషియం సమృద్ధిగా ఉండే ఆహారాలను సమతుల్య ఆహారంలో చేర్చుకోవడం ద్వారా రోజువారీ అవసరాలను తీర్చుకోవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా పోషకాహార అనుబంధాలను తీసుకోవాల్సిన అవసరం సాధారణంగా ఉండదు. నరాలు, కండరాల మధ్య సమాచార ప్రసారానికి అవసరమైన విద్యుత్ సంకేతాలను నిర్వహించడంలో పొటాషియం కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా సోడియం వంటి ఇతర ఎలక్ట్రోలైట్లతో కలిసి కణాల పొరల మీదుగా విద్యుత్ ఆవేశాల కదలికను నియంత్రిస్తుంది. కండరాలు సాధారణంగా సంకోచించడం, తిరిగి విశ్రాంతి స్థితికి రావడం వంటి ప్రక్రియలకు ఇది అవసరం.

పొటాషియం ఎందుకు అవసరం..

బరువులు ఎత్తడం, పరుగెత్తడం, సైక్లింగ్ చేయడం లేదా శరీర బరువుతో వ్యాయామాలు చేయడం వంటి కార్యకలాపాల్లో కండరాలు పదేపదే సంకోచించి శక్తిని ఉత్పత్తి చేస్తాయి. కణాల్లో ద్రవాల సమతుల్యతను కాపాడడంతోపాటు నరాల సాధారణ పనితీరుకు కూడా పొటాషియం తోడ్పడుతుంది. ఆహారం ద్వారా తగినంత పొటాషియం అందకపోతే కండరాల పనితీరు ప్రభావితమవుతుంది. రక్తంలో పొటాషియం స్థాయిలు గణనీయంగా తగ్గితే ఆ పరిస్థితిని హైపోకలేమియా అంటారు. దీనివల్ల కండరాల బలహీనత, కండరాల తిమ్మిర్లు ఏర్పడతాయి. తీవ్రమైన సందర్భాల్లో గుండె స్పందనలో ప్రమాదకరమైన అసమతుల్యత కూడా సంభవిస్తుంది. అయితే, కండరాల తిమ్మిర్లు వస్తున్నాయంటే పొటాషియం లోపం ఉందని నిర్ధారించలేం. కండరాల అలసట సహా అనేక కారణాల వల్ల కూడా తిమ్మిర్లు వస్తాయి. అందువల్ల పొటాషియం తీసుకోవడం పెంచినంత మాత్రాన తిమ్మిర్లు తప్పనిసరిగా తగ్గుతాయని చెప్పలేం.ప్రత్యేక శ్రద్ధ అవసరం..శారీరక శ్రమ చేస్తున్నప్పుడు కండరాలు సంకోచించే ప్రక్రియలో భాగంగా పొటాషియం కండరాల కణాల నుంచి రక్తప్రవాహంలోకి కదులుతుంది. చెమట ద్వారా కూడా కొంత పొటాషియం బయటకు వెళ్లుంది. అయితే, చెమట పట్టే పరిమాణం, అందులో ఉండే పొటాషియం స్థాయిలను బట్టి ఈ నష్టం మారుతుంది. మూత్రపిండాలు, ఇతర శారీరక నియంత్రణ వ్యవస్థలు సాధారణంగా శరీరంలోని పొటాషియం స్థాయిలను సమతుల్యంగా ఉంచేందుకు పనిచేస్తాయి. క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారు సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పొటాషియాన్ని అందించవచ్చు. సాధారణంగా తక్కువ లేదా మధ్యస్థ తీవ్రతతో వ్యాయామం చేసే వారికి సాధారణ భోజనం, తగినంత నీరు తీసుకోవడం ద్వారా శరీరం కోలుకోవడానికి అవసరమైన పోషకాలు అందుతాయి. అయితే, ఎక్కువసేపు తీవ్రమైన వ్యాయామం చేసేవారు, వేడి వాతావరణంలో శిక్షణ పొందేవారు, అధికంగా చెమట పట్టేవారు ద్రవాలు, ఎలక్ట్రోలైట్ల అవసరంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి.అరటి పండ్లు, ఆలుగడ్డలు..

అరటిపండ్లు పొటాషియం, కార్బోహైడ్రేట్లను అందించే సులభమైన ఆహారం. కార్బోహైడ్రేట్లు శరీరానికి శక్తిని అందించడంలో, పొటాషియం కండరాలు, నరాల సాధారణ పనితీరులో సహాయపడతాయి. వ్యాయామానికి ముందు సులభంగా జీర్ణమయ్యే శక్తినిచ్చే ఆహారం తీసుకోవాలనుకునేవారికి అరటిపండు మంచి ఎంపికగా ఉంటుంది. ఆలుగడ్డల్లో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. ముఖ్యంగా తొక్కతో కలిపి తినడం వల్ల కూడా పొటాషియం లభిస్తుంది. వీటిలో ఉండే కార్బోహైడ్రేట్లు వ్యాయామ సమయంలో శక్తిని అందించడంతోపాటు వ్యాయామం తర్వాత కండరాల్లో నిల్వ ఉండే గ్లైకోజెన్‌ను తిరిగి భర్తీ చేయడంలో సహాయపడతాయి.


కొండను తొలిచేందుకు జిలెటిన్ స్టిక్స్
ఎగిరిపడ్డ టిప్పర్ ఐదుగురు దుర్మరణం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. రోడ్డు పనుల కోసం అమర్చిన జిలెటిన్ స్టిక్స్ పేలి ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. పలువురు గాయపడ్డారు. అనంతగిరి మండలం పినకోట వద్ద ఇవాళ (శనివారం) ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పనుల కోసం జిలెటిన్ స్టిక్స్ అమర్చిన విషయం తెలియక టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని ముందుకు పోనిచ్చాడు. అదే సమయంలో జిలెటిన్ స్టిక్స్ పేలడంతో టిప్పర్ ఒక్కసారిగా ఎగిరిపడింది.ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్, టిప్పర్‌లో ఉన్న ముగ్గురు కార్మికులు, ఒక టీచర్ ప్రాణాలు కోల్పోయారు. మరికొందరికి గాయాలయ్యాయి. గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. రహదారి పనుల్లో భాగంగా కొండను తొలిచేందుకు రోడ్డు పనుల నిర్వాహకులు జిలెటిన్ స్టిక్స్‌ను పెట్టారు. కానీ అటువైపు ఎవరూ రాకుండా చూడటంతో నిర్లక్ష్యం వహించారు. ఆ నిర్లక్ష్యమే ఐదుగురి ప్రాణాలు తీసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



ఫేక్ సర్టిఫికెట్లతో కొలువులు - ఆ 800 మంది 'నకిలీ అధ్యాపకుల' గుర్తింపు వేగవంతం

హైదరాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్లుగా క్రమబద్ధీకరణ సమయంలో నకిలీ పోస్ట్ గ్రాడ్యుయేషన్? (పీజీ) సర్టిఫికెట్లను ఉపయోగించి రెగ్యులర్ ఉద్యోగాలు పొందిన వ్యక్తులను గుర్తించే ప్రక్రియను ఇంటర్? బోర్డు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే 35 మందిని తొలగించిన బోర్డు, మిగిలిన సిబ్బంది సర్టిఫికెట్ల ధ్రువీకరణను వేగవంతం చేసింది. ఈ ప్రక్రియ అనంతరం అధ్యాపకుల మార్కుల శాతాలను కూడా పరిశీలించే యోచనలో ఉంది.ధ్రువీకరణ డిసెంబర్ నాటికి పూర్తిరాష్ట్రంలోని 430 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2000 నుంచి 2014 మధ్య కాలంలో పలు విడతలుగా కాంట్రాక్ట్ అధ్యాపకులుగా చేరారు. అయితే 2013 మేలో అప్పటి ప్రభుత్వం వారి పోస్టులను క్రమబద్ధీకరించింది. దీంతో 3,800 మంది శాశ్వత జూనియర్ లెక్చరర్లుగా మారారు. వీరిలో చాలా మంది బిహార్, ఉత్తర్? ప్రదేశ్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లోని పలు



విశ్వవిద్యాలయాల నుంచి పీజీ సర్టిఫికెట్లను సమర్పించారని, సరైన ధ్రువీకరణ లేకుండానే అధికారులు వాటిని ఆమోదించి నియామక ఉత్తర్వులు జారీ చేశారని ఆరోపణలున్నాయి.ఈ నేపథ్యంలో అప్పటి నుంచి ఇప్పటికీ ఈ సర్టిఫికెట్ల సమీక్ష కొనసాగుతోంది. ప్రొబేషనరీ సమయం? సమీపించడంతో దీని ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ సర్టిఫికెట్లను ధ్రువీకరించడానికి ఇతర రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలకు అధికారులను పంపుతున్నారు. వారి సర్టిఫికెట్లపై ధ్రువీకరణ పొందుతున్నారు. సర్టిఫికెట్లు నకిలీవని తేలడంతో ఇటీవల 35 మందిని తొలగించారు.వారిని ఇంకా పరిశీలించాల్సి ఉందిమన రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల సర్టిఫికెట్లు ఉంటే విశ్వవిద్యాలయా నికి సంబంధించిన అధికారులతో సంప్రదించడమే కాకుండా, పోలీసుల నుంచి కూడా నివేదికలను తీసుకుంటున్నారు. అయితే ప్రస్తుతానికి సుమారుగా 700 నుంచి 800 మంది వ్యక్తుల ధ్రువపత్రాలు ఇంకా పరిశీలించాల్సి ఉంది. దీనిలో ఇతర రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలకు చెందిన సుమారు 400 మంది వరకు ఉంటారని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ మొత్తం ప్రక్రియను డిసెంబరు నాటికి పూర్తవుతుందని అధికారు అంటున్నారు.ఆ లేఖలు కూడా నకిలీవేకాంట్రాక్ట్ అధ్యాపకులు రెగ్యులర్? అయిన తర్వాత వారికి సంబంధించిన సర్టిఫికెట్లు అసలువేనని ధ్రువీ కరిస్తూ వారి సంబంధిత విశ్వవిద్యాలయాల నుంచి లిఖిత పూర్వకంగా లేఖ తెచ్చుకోవాలని బోర్డు ఆదేశించింది. దీనికి అధ్యాపకులంతా ఈ తరహా లేఖలను సమర్పించారు. వీరిలో పదుల సంఖ్యలో వ్యక్తులు విశ్వవిద్యాలయ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు తెలుస్తోంది.వారిలో ఒకరు సమర్పించిన లేఖలోని కోర్సు, ఆయన ఆ రాష్ట్ర వర్సిటీలో చదివిన సంవత్సరంలో లేదని సమాచారం. వీరితో పాటు అనేక మంది ఉమ్మడి రాష్ట్రంలోని వర్సిటీల నుంచి పీజీ పూర్తి చేసిన వారు సైతం ఉత్తీర్ణత శాతాన్ని పెంచి చూపినట్లు ఆరోపణ లొస్తున్నాయి.నకిలీ సర్టిఫికెట్లపై దర్యాప్తు ముగిసిన తర్వాత మార్కుల శాతంపై దృష్టి సారిస్తామని బోర్డు వర్గాలు చెబుతున్నాయి. ర్పించి ఉద్యోగంలో చేరిన వారు స్వచ్ఛందంగా వైదొలిగితే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేయాలని ఉన్నతాధికారులు కోరుతున్నట్లు తెలిసింది.

సన్నవడ్లకు పెరిగిన డిమాండ్

కరీంనగర్:



ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక వరినాట్లు తక్కువగా వేశారు. యాసంగిలో కూడా వరి వేయవద్దని ప్రభుత్వం చెబుతుండడంతో సన్నరకం ధాన్యానికి డిమాండ్ పెరిగింది. మరోవైపు బియ్యం ధరలు పెరుగుతు ండడంతో మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారులు ముం దుగానే ధాన్యాన్ని సమకూ ర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సన్నవడ్లను నేరుగా కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతు న్నారు.వ్యాపారులు ధాన్యాన్ని కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని నరసరావుపేట, గుంటూరు, మండపేట, గుడివాడతో పాటు తెలంగాణలోని మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ, ఖమ్మం జిల్లాలకు తరలిస్తున్నారు.ఇటీవల మార్కెట్‌లో సన్న బియ్యానికి గిరాకీ పెరగడంతో వ్యాపారులు ధాన్యం సేకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గతంలో రైతులు తమ ధాన్యాన్ని వ్యవసాయ మార్కెట్ లేదా కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి విక్రయించేవారు. ప్రస్తుతం కొందరు వ్యాపారులు, మిల్లర్లు రైతుల వద్దకే వెళ్లి ధాన్యం కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. అడ్వాన్స్‌గా డబ్బులు తీసుకోవాలని కోరుతున్నారు. దీంతో రైతులకు కూడా శ్రమ, ధాన్యం తరలింపు ఖర్చులు తప్పుతున్నాయి.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం.. చిన్నారులకు తీవ్ర గాయాలు



హైదరాబాద్, :

హైదరాబాద్ వనస్థలిపురంలోని ఆటోనగర్‌లో రోడ్డు ప్రమాదం జరిగింది. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్ హైకోర్టు కాలనీ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. హయత్‌నగర్ రంగనాయకుల గుట్టకు చెందిన వంశీ, వాణి దంపతులు ఇద్దరు పిల్లలతో బైకుపై ఎల్బీనగర్ వైపు ప్రయాణిస్తుండగా ఓ కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ప్రమాద ధాటికి ఇద్దరు చిన్నారులు గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడ్డారు.ఈ ఘటనలో చిన్నారులు మాన్విశ్ (2), యుగ్విశ్ (ఏడాదిన్నర)కు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారుల తలకు గాయాలు, చెవుల నుంచి రక్తస్రావం అయినట్లు తెలుస్తోంది. బీటెక్ విద్యార్థి నితిన్ కారు నడుపుతున్నట్లు సమాచారం. కారులో నితిన్‌తో పాటు మరో ఇద్దరు స్నేహితులు ఉన్నట్లు తెలిసింది. సమాచారం అందగానే ఘటనాస్థలికి వనస్థలిపురం పోలీసులు చేరుకున్నారు. ఈ ప్రమాదంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై అధికారిక వివరాలు తెలియాల్సి ఉంది.

ఓటు తొలగించారని ఒక్కరూ ఫిర్యాదు చేయలేదు.. ఆధారాలు ఉంటే చూపండి

హైదరాబాద్ :

ఓట్ల తొలగింపు పేదలకు వ్యతిరేకంగా బీజేపీ పన్నిన కుట్ర అని సీఎం ఆరోపణ

ఆరోపణలకు ఆధారాలు చూపాలని రేవంత్ రెడ్డికి బీజేపీ సవాల్ 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' పేరుతో పాదయాత్రలకు సిద్ధమైన బీజేపీ నవంబర్ 1 నుంచి హైదరాబాద్, సిద్దిపేట, కరీంనగర్‌లో బీజేపీ యాత్రలు

తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. తమ ఓటును తొలగించారని రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయలేదని, కానీ కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.


ఓటర్ల జాబితా సవరణ పేరుతో పేదలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు, మహిళల ఓట్లను తొలగించి ఎన్నికల్లో గెలవాలని బీజేపీ కుట్ర పన్నుతోందని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించిన విషయం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అంటూ రెండు రకాల పౌరులను సృష్టిస్తున్నారని, పశ్చిమ బెంగాల్,



మహారాష్ట్రలోనూ బీజేపీ ఇదే పద్ధతిని అనుసరించిందని ఆయన విమర్శించారు. ఈ ఆరోపణలపై శుక్రవారం రాంచందర్ రావు స్పందిస్తూ, "ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా తన ఓటు పోయిందని చెప్పలేదు. కానీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మాత్రమే వీధుల్లోకి వచ్చి ఓట్లు తొలగించారని అరుస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి, ఆయన మంత్రులు తమ ఆరోపణలకు ఆధారాలు చూపించాలని సవాల్ విసిరారు.ఓట్ల తొలగింపు అంశంపై నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ ఆ తర్వాత సిద్దిపేట, కరీంనగర్‌లో కొనసాగుతుందని ఆయన తెలిపారు.ముఖ్యమంత్రి,పార్టీ తలపెట్టిన నిరసనలో ఆ పార్టీ నేతలు రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, బీజేపీ మధ్య ఓటర్ల జాబితా సవరణ అంశం తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. భారీ ఎత్తున ఓట్లు తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తుండగా, ఇది కేవలం నకిలీ, డూప్లికేట్, మరణించిన ఓటర్లను గుర్తించి తొలగించేందుకు ఎన్నికల సంఘం చేపట్టే సాధారణ ప్రక్రియేనని బీజేపీ వాదిస్తోంది.

ఏపీ మున్సిపల్ ఎన్నికల బరిలో 'మజ్లిస్' - ప్రచారానికి హైదరాబాద్ నుంచి ఎమ్మెల్యేలు

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు మజ్లిస్ (ఏఐఎమ్ఐఎమ్) పార్టీ ముమ్మరంగా ప్రచారం చేస్తోంది. కడప కార్పొరేషన్ మేయర్ పదవికి, హిందూపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ స్థానానికి ఆ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. విజయవాడ, కడప కార్పొరేషన్లతో పాటు మరో 5 మున్సిపాలిటీల్లో మొత్తం 21 మంది మజ్లిస్ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.పార్టీ అధ్యక్షుడి సూచనల మేరకుఇటీవల ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు మజ్లిస్ నాయకులు హైదరాబాద్‌కు వచ్చి పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీని కలిశారు. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను బరిలో దించితే కచ్చితంగా విజయం సాధిస్తామని ఆయనతో ధీమా వ్యక్తం చేశారు. అన్ని మున్సిపాలిటీ స్థానాల్లో కాకుండా కచ్చితంగా విజయం సాధిస్తామని నమ్మకం ఉన్న వార్డులు, డివిజన్లలో మాత్రమే పోటీ చేయాలని ఒవైసీ సూచించగా, అందుకు వారు అంగీకరించారు. దీంతో కడప కార్పొరేషన్ మేయర్ పదవికి, విజయవాడ కార్పొరేషన్‌లోని మూడు డివిజన్లకు అభ్యర్థులను ఖరారు చేశారు.ప్రచారం ప్రారంభించిన మజ్లిస్ నేతలుహిందూపురం పురపాలక చైర్‌పర్సన్ స్థానంతో పాటు మరో 5 వార్డుల్లో మజ్లిస్ పార్టీ అభ్యర్థులు బరిలో నిలుస్తున్నారు. అలాగే ఆదోని-7, రాయదుర్గం-3, పెనుగొండ, నంద్యాల మున్సిపాలిటీల్లో ఒక్కో వార్డు చొప్పున పోటీ



చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించేందుకు హైదరాబాద్ నుంచి ఎంఐఎం ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మిరాజ్, మాజిద్ హుస్సేన్, మహ్మద్ ముబీన్‌తో పాటు ఎమ్మెల్సీ రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీలు ఇప్పటికే ఏపీకి వెళ్లి, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.నవంబర్ 1న ఎన్నికలుఆంధ్రప్రదేశ్‌లోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల ప్రక్రియ కోసం ఆ రాష్ట్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ షెడ్యూల్ ప్రకారం నవంబర్ 1న 87 మున్సిపల్ కార్పొరేషన్లు, 13 మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు పోలింగ్ జరగనుంది. అవసరమైన చోట్ల నవంబర్ 2న రీ-పోలింగ్ నిర్వహించాలని సూచించింది. నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టాలని ప్రకటించింది. వాస్తవానికి అక్టోబర్ 28న పోలింగ్ జరగాల్సి ఉండగా, సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ మార్పులు చేసింది.సుప్రీంకోర్టు ఆదేశాలతో కొత్త షెడ్యూల్స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తొలి విడతగా నోటిఫికేషన్ జారీ చేసి, ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించాలని ఏపీఎస్?ఈసీ నిర్ణయించింది. ఉపసంహరణలకు ఈ నెల 21 మధ్యాహ్నం 3 గంటల వరకు గడువునిచ్చింది. అయితే తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారంటూ వైఎస్సార్సీపీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ మేరకు తుది జాబితాను వాయిదా వేసి నామినేషన్ వేయలేకపోయిన వారికి అవకాశం కల్పించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. దీంతో ఎన్నికల ప్రక్రియను ఏపీఎస్?ఈసీ తాత్కాలికంగా వాయిదా వేసింది. అన్ని జిల్లాల నుంచి నివేదికలు తెప్పించుకొని కొత్త షెడ్యూల్‌ను ప్రకటించింది.

ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు లంచం డిమాండ్.. దళిత సర్పంచ్ మానస ఆవేదన



వేలేరు : హనుమకొండ జిల్లాలోని వేలేరు మండలం గుండ్లసాగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల వ్యవహారం వివాదానికి దారి తీసింది. ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలు జరుగుతున్నాయని, అర్హులకు ఇల్లు కేటాయించకుండా ఇతరులకు కేటాయిస్తున్నారని గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు.జీపీ కార్యదర్శి రూ.50 వేలు లంచం తీసుకుని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మరోవైపు తాను బీఆర్ఎస్ పార్టీకి చెందిన దళిత సర్పంచ్ కావడంతో కొంత మంది రాజకీయ నాయకులు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామ సర్పంచ్ మానస ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల విషయంలో నెలకొన్న వివాదం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చూడాలని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకత పాటించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లంచం ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోలీసు వ్యవస్థ పనితీరు అవగాహన కోసం 'ఓపెన్ హౌస్'?

అనంతగిరి, అక్టోబర్ 24 : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సూర్యాపేట జిల్లా అనంతగిరి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల విధులు, బాధ్యతలు, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ



అందిస్తున్న సేవల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ శాఖలో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, భద్రతా పరికరాలు, కమ్యూనికేషన్ పరికరాలు, నేర పరిశోధనకు ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక పోలీసింగ్ విధానాల గురించి స్టేషన్ సిబ్బంది విద్యార్థులకు వివరించారు.ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు వారి ధైర్యసాహసాలను విద్యార్థులకు వివరించి. సమాజంలో శాంతి, భద్రతలను కాపాడటంలో పోలీసుల పాత్ర ఎంత ముఖ్యమైనదో వారికి తెలియజేశారు. విద్యార్థులు చట్టాలను గౌరవించాలని, క్రమశిక్షణతో మెలగాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలు మరియు ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎల్ నినో, కరవుపై బీఆర్ఎస్ విమర్శలకు కాంగ్రెస్ నేతల కౌంటర్

హైదరాబాద్ : హైదరాబాద్: ఎల్ నినో ప్రభావం, కరవు పరిస్థితులపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు కాంగ్రెస్ నేతలు ఘాటుగా స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని పరిస్థితులను వివరిస్తూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ వేముల వీరేశం విమర్శలు గుప్పించారు. కరోనా సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని మంత్రి అడ్లూరి ఆరోపించగా.. ఫామ్‌హౌస్‌లో కూర్చొని ప్రభుత్వంపై విమర్శలు చేయడం కేసీఆర్‌కు అలవాటుగా మారిందని వేముల వీరేశం మండిపడ్డారు. హైదరాబాద్‌లోని సీఎల్పీ మీడియా హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతలు ఎల్ నినోపై బీఆర్ఎస్ విమర్శలను తిప్పికొట్టారు. కరోనా మహమ్మారి సమయంలో తన సొంత చెల్లిని కోల్పోయానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్



ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి ఉంటే తన చెల్లి ప్రాణాలతో ఉండేదని వ్యాఖ్యానించారు. అప్పటి కేసీఆర్ ప్రభుత్వ అసమర్థత కారణంగానే కరోనా మందులు బ్లాక్ మార్కెట్‌లోకి వెళ్లాయని ఆరోపించారు. ఆ సమయంలో కనీసం మాస్కులు కూడా అందించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. మహమ్మారి సమయంలో కేసీఆర్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని ఆరోపించారు. కరోనా మరణాలకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యత వహిస్తారా? అని అడ్లూరి ప్రశ్నించారు.కరోనా సంక్షోభ సమయంలో కాంగ్రెస్ పార్టీ హుందాగా వ్యవహరించిందని ఆయన పేర్కొన్నారు. కరవుకు కాంగ్రెస్ కారణమైతే, కరోనా సంక్షోభానికి బీఆర్ఎస్ కారణమా? అని ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ నేతల విమర్శలకు మంత్రి కౌంటర్ ఇచ్చారు. ఎల్ నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపించే ప్రకృతి సంబంధిత పరిణామమని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులను రాజకీయాలతో ముడిపెట్టి విమర్శలు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ముఖ్యమంత్రి ప్రణాళికలు రూపొందిస్తున్నారని, విపత్తుల సమయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని తెలిపారు. తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని మంత్రి అడ్లూరి ధీమా వ్యక్తం చేశారు.ఫామ్‌హౌస్‌లో కూర్చొని విషం చిమ్ముతున్నారు: వేముల వీరేశంబీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ప్రభుత్వ విప్ వేముల వీరేశం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫామ్‌హౌస్‌లో కూర్చొని ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని విమర్శించారు. కరవుకు కాంగ్రెస్ కారణమని చెప్పే కేసీఆర్‌ను సైంటిస్టుగా అభివర్ణిస్తూ ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన వ్యక్తి కేసీఆర్ అని ఆరోపించారు. కరోనా సంక్షోభానికి కేసీఆర్ కారణమని తాము చెప్పడం లేదని, అయితే కరవు పరిస్థితులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు సరికావని వీరేశం వ్యాఖ్యానించారు.చిల్లర మాటలు, చిల్లర వాగ్దానాలుగా అభివర్ణిస్తూ వీరేశం మండిపడ్డారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..